క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


సీఐ శ్రీరామ్

ఆదోని అర్బన్: వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా శ్రీరామ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతిలోని రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న శ్రీరామ్ సాధారణ బదిలీల్లో భాగంగా ఆదోనికి వచ్చారు. ఇక్కడున్న సీఐ తేజమూర్తి కడపకు బదిలీ అయ్యారు. సీఐ శ్రీరామ్ గతంలో ఆదోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఐదు నెలల పాటు సీఐగా పనిచేశారు.

కౌతాళం తహసీల్దారుగా మల్లికార్జునస్వామి



కౌతాళం: కౌతాళం మండల తహసీల్దారుగా మల్లికార్జున స్వామి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సిబ్బందిని కలుపుకొని పోయి సమన్వయంగా పనిచేస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని లబ్ధిదారులకు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వారి పనులు పూర్తి చేస్తామన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓగా కె.వసుంధర



ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారిగా కె.వసుంధర సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

గోనెగండ్ల తహసీల్దార్‌గా..


కె.కుమారస్వామి

గోనెగండ్ల: మండల తహసీల్దార్‌గా కె. కుమారస్వామి సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న పార్వతి బదిలీపై చిత్తూరు వెళ్లారు. తాను ఎన్నికల ముందు ఆస్పరి మండలంలో పనిచేశానని, ఎన్నికల బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లాకు వెళ్లాను అక్కడ నుండి బదిలీపై గోనెగండ్లకు వచ్చానని కుమారస్వామి చెప్పారు.

ఎమ్మిగనూరు రూరల్ సీఐగా విక్రంసింహా



ఎమ్మిగనూరురూరల్: రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విక్రంసింహా సోమవారం బాధ్యతలు చేపట్టారు. వైఎస్సార్ జిల్లా బద్వేల్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ మోహన్‌రెడ్డిని వీఆర్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన సీఐకి రూరల్ ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి, సిబ్బంది అభినందనలు తెలిపారు.

రాజగోపురానికి విరాళాలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ప్యాలకుర్తి వాస్తవ్యులైన యాపచెట్టు ఉగ్రనరసింహ వారి కుటుంబ సభ్యులు రూ.1,11,111లక్షలను అందజేసినట్లు ఆలయ డిప్యూటి కమిషనర్ గురుప్రసాద్ సోమవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి, కుటుంబ సభ్యులు రాజగోపురం నిర్మాణానికి రూ. 50,000వేలు, శాశ్వత నిత్య అన్నదానం కోసం రూ.25,000 విరాళంగా ఇచ్చారన్నారు.

అందరు ఉన్నా అనాథగా ..


బాషా మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని పాత 11వ వార్డులో అనారోగ్యంతో మృతి చెందిన పింజరి బాషా అందరూ ఉన్నా అనాథగా మిగిలిపోయాడు. మద్యానికి బానిసైన పింజరి బాషా ఐదు సంవత్సరాలుగా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. భార్య హోటల్లో పనిచేస్తూ పిల్లలను పోషిస్తుంది. 11వ వార్డులో లుక్మాన్ గుజిరి సామన్ల షాప్ దగ్గర పింజరి బాషా ఉంటూ రోజు కొందరు యువకులు సాయం చేస్తే తిని అక్కడే పడుకునేవాడు. సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం భార్య, కుటుంబ సభ్యులకు తెలుపగా.. తమ దగ్గర దహన సంస్కారాలకు డబ్బులు లేవు, మేము రాము అని చెప్పడంతో సీఎండీ హఫీస్, షబ్బీర్, జావీద్, షేక్‌సాధిక్‌లు ముందుకు వచ్చి పింజరి బాషా మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు


వినతులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి కె.వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య పాల్గొన్నారు.

చతికిల 'బడి'

- విద్యార్థులకు నేటికీ అందని స్కూల్ యూనిఫామ్స్
- ఉపాధ్యాయుల కొరతతో కుంటుపడుతున్న బోధన
- ఏకోపాధ్యాయుల పాఠశాలలతో చట్టుబండలవుతున్న చదువులు
- మధ్యాహ్న భోజనంలో రాజకీయంతో లోపిస్తున్న నాణ్యత
- ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి

సర్కారు బడి.. నిన్నటి వరకు అదో గారాల అమ్మ ఒడి. నేడు ఆ అమ్మ ఒడి పిల్లల కష్టాలతో బరువెక్కింది. అరకొర విద్యా కానుకలు.. రుచిశుచి లేని భోజనాలు.. ఏకోపాధ్యాయుల బోధనలు.. తదితర సమస్యలతో బడి కళ కనుమరుగయ్యే దుస్థితి దాపురించింది. అమ్మఒడి ఇవ్వకుండా తల్లిదండ్రులను కష్టాల సుడిగుండంలో పడేసిన టీడీపీ సర్కారు విద్యార్థుల కనీస అవసరాలు తీర్చలేని స్థితిలో ఉండిపోయింది. ఆదోని డివిజన్ పరిధిలో ప్రభుత్వ బడుల పనితీరు అంతంత మాత్రమే. ప్రభుత్వం చదువులను చక్కబెట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై 'సాక్షి' విజిట్ చేయగా పలు సమస్యలు వెలుగు చూశాయి.


ఎమ్మిగనూరు బాలికల హైస్కూల్‌లో ఇంటినుంచి క్యారియర్లు తెచ్చుకొని తింటున్న విద్యార్థినులు


తుంబిగనూరులో అన్ని తరగతులకు బోధిస్తున్న ఒకే ఉపాధ్యాయుడు, తిమ్మాపురంలో ఏకోపాధ్యాయుడి బోధన, గోనెగండ్ల పాఠశాలలో స్కూల్ యూనిఫాం ఇవ్వకపోవడంతో కలర్ డ్రస్సుల్లో వచ్చిన విద్యార్థులు

ఆదోని టౌన్/ఎమ్మిగనూరు/మంత్రాలయం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో తట్టుకొనే విధంగా ప్రభుత్వ విద్యా రంగంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చింది. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా తరగతి గదులు నిర్మించి, మౌలిక సదుపాయాలు మెరుగుపరిచింది. ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ బోధన, ఆంగ్ల మాధ్యమంలో తరగతుల నిర్వహణ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అత్యున్నత శిఖరాలకు చేరుకునేలా చర్యలు తీసుకుంది. జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులక పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం, రాగిజావ, వేరుశనగ చిక్కిలను, గుడ్లను విద్యార్థులకు అందించింది. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వీటిని కొనసాగిచడంలో వెనుకబడింది. పేద విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేయడంపై ముందుకు వెళ్లడం లేదు.

విద్యార్థుల వివరాలు..

ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వ, పురపాలక, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు 126 ఉన్నాయి. అయా పాఠశాలల్లో 28,942 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడబూరు, కౌతాళం, కోసిగి, మంత్రాలయం మండలాల్లో 196 పాఠశాలలుండగా విద్యార్థులు 50,357 ఉన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు పట్టణం, మండలంతో పాటు గోనెగండ్ల, నందవరం మండలాల్లో ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలు 269 ఉండగా వాటిలో దాదాపు 60,657 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. ప్రభుత్వ బడులలో చదువుకునే విద్యార్థులంతా పేద మధ్య తరగతి వారే.

కానుకలో కినుకు..

పేద విద్యార్థులకు విద్యా కానుక కింద యూనిఫాం, బూట్లు, బెల్టులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, స్కూల్ బ్యాగులు ఇచ్చేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ కిట్లు పంపిణీకి సిద్ధం చేశారు. మంత్రాలయం నియోజకవర్గంలో 50,357 విద్యార్థులు ఉండగా అందులో కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు కిట్లు పంపిణీ కాలేదు. నియోజకవర్గంలో దాదాపు 2,447 మందికి కిట్లు మంజూరు కాలేదు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు దాటినా కొత్తగా పంపిన ప్రతిపాదనలకు ఇప్పటికీ మోక్షం లేదు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఒక్కరికి కూడా యూనిఫాం పంపిణీ చేయలేదు. దీంతో చాలా మంది విద్యార్థులు పాత దుస్తులు, సివిల్ డ్రస్‌ల్లో బడికి వస్తున్నారు. కోసిగి, పెద్దకడబూరు మండలాల్లో చాలా చోట్ల యూనిఫాం పంపిణీ సాగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులు చదువులకు ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో పాఠశాలల ప్రారంభంరోజే స్కూల్ కిట్లను అందజేసేవారు. అయితే ఎన్‌డీఏ కూటమి అధికారం చేపట్టిన తరువాత నెల తర్వాత కొన్ని పుస్తకాలు దశల వారీగా పంపిణీ చేసింది. 28,942 మంది విద్యార్థులు ఉండగా అధికారులు పెట్టిన ఇండెంట్ ప్రకారం 1,65,444 నోట్ పుస్తకాలు, బ్యాగులు 28,942, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు 3,440, పిక్టోరియల్ డిక్షనరీలు 2,286 గాను 2015 మాత్రమే వచ్చాయి.

బోధన.. వేదన

విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు ఉంటేనే బోధన సాఫీగా సాగుతుంది. బదిలీలు చేపట్టినా నేటికీ పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేపట్టలేదు. మంత్రాలయం నియోజకవర్గంలో 196 పాఠశాలల్లో 50,357 మంది విద్యార్థులకుగానూ కేవలం 574 మంది పనిచేస్తున్నారు. మంజూరు చేసిన పోస్టుల్లో 356 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 17 పాఠశాలల్లో కేవలం ఒక్కరు చొప్పున ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్నారు. 10 పాఠశాలల్లో ఎలాంటి టీచర్లు లేక డెప్యూటేషన్ ఉపాధ్యాయులతో నెట్టుకొస్తున్నారు. మాలపల్లి ఉర్దూ, కంబలదిన్నె, దొడ్డి, తుంబిగనూరు, హాల్వి, పొదలకుంట, కౌతాళం ఉర్దూ, ఓబుళాపురం, తిమ్మాపురంలో పాఠశాలల్లో ఒక్కరు చొప్పున ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఏదైనా పనిబడి ఉపాధ్యాయులు సెలవు పెడితే ఆరోజు ఆ స్కూళ్లకు సెలవు ఇచ్చుకోవాల్సిన దుస్థితి.

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో..

ఎమ్మిగనూరులో 234 మంది ఉపాధ్యాయులుండగా దాదాపు 134 ఖాళీలున్నాయి. నందవరం మండలంలో 324 మంది ఉపాధ్యాయులుండాల్సి వుండగా 84 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏకోపాధ్యాయ పాఠశాల ఒకటి వుంది. ఇక గోనెగండ్ల మండలంలో 328 మంది ఉపాధ్యాయులు ఉండగా 81 ఖాళీలున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నెరడుప్పుల, అయ్యకొండ గ్రామాల్లోని పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడు ఐదు తరగతులకు బోధించాల్సివస్తుంది. గోనెగండ్లలోని లక్ష్మీపేట పాఠశాలలో 110 మంది విద్యార్థులకు గాను ఇద్దరు ఉపాధ్యాయులు బోధించే దుస్థితి నెలకొంది. మరో మూడు పాఠశాలల్లో ఇదే పరిస్థితి.

ఆదోని నియోజకవర్గంలో..

ఆదోని పట్టణంలోని ఆర్‌ఆర్‌లెబర్ కాలనీలోని పురపాలక ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 960 మంది విద్యార్థులు ఉంటే నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. అంబేద్కర్ నగర్‌లోని పురపాలక ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 50 మంది విద్యార్థులు ఉంటే ఒకే ఉపాధ్యాయురాలు బోధిస్తున్నారు. కల్లుబావి ప్రాథమిక పాఠశాలల్లో 470 మంది విద్యార్థులు ఉంటే నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక పెద్దతుంబళం ఎస్‌డబ్ల్యూ ప్రాథమిక పాఠశాల, పెసలబండలోని ప్రాథమిక పాఠశాల, పట్టణంలోని కిలిచిన్ పేట పురపాకల ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. దీంతో ఉన్న ఉపాధ్యాయులతోనే వర్క్ అడ్జెస్ట్ చేసుకుంటూ పాఠాలను బోధిస్తున్నారు.

'మధ్యాహ్న భోజనం'లో రాజకీయం

ఏ విద్యార్థి కూడ రక్తహీనతతో బాధ పడకూడదని గత ప్రభుత్వం నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే విద్యార్థులకు రోజుకు ఒక రకమైన భోజనంతో పాటు ఉదయం పూట రాగి జావ, మధ్యాహ్నం నాణ్యతతో కూడిన ఆహారం, ఉడికించిన గుడ్లు, చిక్కిలను అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజనానికి రాజకీయ కుంపటితో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వంట ఏజెన్సీలను మార్చాలని వాటి నిర్వహణ బాధ్యత మాకు అప్పగించాలని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు వారిలో వారే కొట్టుకుంటున్నారు. ఇటీవల ఆదోని మండలంలోని గణేకల్లు, హానవాళు, పెద్దతుంబళం, మండిగిరి గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడ్డారు. దీంతో నాణ్యత ప్రమాణాలకు తూట్లు పొడిచే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికే పట్టణంలోని అమరావతి నగర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పురపాలక ఉన్నత పాఠశాల, అర్‌జీ నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సంతపేట పురపాలక ప్రాథమిక పాఠశాలలో వంట ఏజెన్సీలను మార్చి కొత్తవారికి అప్పగించారు. మంత్రాలయం నియోజకవర్గంలో దాదాపు అన్ని పాఠశాలల్లో టీడీపీ వంట ఏజెన్సీలను మార్పు చేసింది. రాజకీయ ప్రవేశంతో పిల్లలకు ఏజెన్సీలు వండించేదే పరమాన్నంగా మారింది. మెనూ కూడా తూతూమంత్రంగా పాటిస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని బాలికల హైస్కూల్‌తో పాటు కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపం వుండటంతో దాదాపు 20 శాతం మంది విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారియర్లు తెచ్చుకొని తింటున్నారు. ఇదే పరిస్థితి నియోజకవర్గంలోని కొన్ని పాఠశాలలో ఉంది.

స్కూలు యూనిఫాం రాలేదు



మా బడిలో చాలా మంది విద్యార్థులు ఉన్నారు. ఎక్కువ మందికి స్కూలు యూనిఫాం రాలేదు. కొందరు పాత బట్టలు వేసుకుని బడికి వస్తున్నారు. ఇంకొందరు కలర్ దస్తులు వేసుకుని వస్తున్నాం. సారోళ్లు కొత్త బట్టలు ఇస్తే బాగుంటుంది.

– మౌనిక, 2వ తరగతి, పెద్దకడబూరు

ఐదు తరగతులకు ఒక్కరే



మా ఊరి బడిలో ఐదు తరగతులకు ఒక్కరే టీచరు ఉన్నారు. పాఠశాలలో 120 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అందరినీ ఒకే చోట కూర్చోబెట్టి సదువు చెబుతున్నారు. ఇలా ఉంటే భవిష్యత్తులో ఉన్నత చదువులకు వెళితే విద్యార్థులు ఏమి ప్రతిభ చూపుతారు.? పోటీ ప్రపంచంలో చదువుతోనే జీవితం ముడి పడి ఉంది. ఇంతగా చదువుకు ప్రాధాన్యత ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం పోవడం బాధాకరం.

– నరసింహా, ఓబుళాపురం

ఉపాధ్యాయులను నియమించాలి



పాఠశాలలో 960 మంది విద్యార్థులు ఉన్నారు. నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. వారితోనే వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేసుకుని విద్యను అందిస్తున్నాం. గతేడాది డిప్యూటేషన్ మీద ఉపాధ్యాయులను నియమించడం ద్వారా 10వ తరగతిలో 67 శాతం ఉత్తీర్ణతను సాధించాం. హరిక్రిష్ణ అనే విద్యార్థి 568 మార్కులను సాధించి టాపర్‌గా నిలిచాడు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమిస్తే విద్యార్థులకు మంచి భవిషత్తును అందించిన వారవుతాము. – **రమేష్ నాయుడు, హెచ్‌ఎం, మున్సిపల్ ఉన్నత పాఠశాల, అర్‌అర్ లేబర్ కాలనీ, ఆదోని**

సమస్యలను పరిష్కరిస్తాం



పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం. విద్యాకానుకకు సంబంధించి నోట్, పాఠ్య పుస్తకాల నుంచి బట్టలు, షూలు వరకు అన్ని వచ్చాయి. వాటిని విద్యార్థులకు అందించాం. మధ్యాహ్నభోజనం విషయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో డిప్యూటేషన్ (వర్క్ అడ్జెస్ట్ మెంట్) ద్వారా ఉపాధ్యాయులను నియమించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. త్వరలో సమస్యలు పరిష్కారమవుతాయి. – **శ్రీనివాసులు ఎంఈఓ–2, ఆదోని**

బాధితులకు పరామర్శ


పెద్దయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో టీడీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడి కర్నూలులోని ఓ ప్రైవేట్ అస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దయ్యను సోమవారం మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి అండగా వుంటామని భయపడవద్దని భరోసా ఇచ్చారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఆయన వెంట మల్కాపురం సర్పంచ్ దేవేంద్ర, ఎంపీటీసీ హనుమంతు, యువరాజు, వైస్ ఎంపీపీ పోలయ్య, సర్పంచులు లక్ష్మన్న, రంగస్వామి, వెంకటరామిరెడ్డి, ఏనుగుబాల పరమేశ్వరరెడి ఉన్నారు.


గాయపడ్డ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ బుట్టా రేణుక

గాయపడిన కార్యకర్తలకు బుట్టా రేణుక పరామర్శ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పరమాన్‌దొడ్డి గ్రామంలో తెలుగుదేశం నాయకుల దాడిలో గాయపడ్డిన వెంకటేష్, లక్ష్మీనారాయణలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. దాడికి గల కారణాలు, గాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరు భయపడాల్సిప పనిలేదని చెప్పారు. అధికారం ఇస్తే అభివృద్ధి చేసి చూపించాలని, ఇలా దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్.బసిరెడ్డి, నల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

'విద్యార్థినిది ముమ్మాటికీ హత్యే'

కోసిగి: మంత్రాలయం మండలం రచ్చుమర్రి ఏపీ మోడల్ స్కూల్ హస్టల్‌లో పదో తరగతి విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యగా చేసుకుందన్న విషయం అవాస్తవమని, ముమ్మాటికి అది హత్యేనని ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా సహాయక కార్యదర్శి వీరేష్ ఆరోపించారు. సోమవారం ఆయన కోసిగిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆ విద్యార్థిని దేహంపై అనేక చోట్ల గాయాలు ఉన్నాయని, మెడపై ఇనుప రాడ్‌తో కాల్చినట్టు ఆనవాళ్లు ఉన్నాయన్నారు. హాస్టల్‌లో సీసీ ఫుటేజ్ రికార్డులో నమోదు కాలేదని, పనిచేయలేదని చెప్పడం అనేక అనుమానాలకు దారితీస్తోందన్నారు. పోస్టుమార్టం అనంతరం పూర్తి విచారణ చేసి విద్యార్థిని మృతికి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. నాయకులు విజయ్, మల్లికార్జున, సురేష్, రాము, బడేసాబ్, మజీద్, అజిత్‌లు పాల్గొన్నారు.

స్కూళ్లలో రాజకీయ జోక్యం సరికాదు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయ జోక్యం సరికాదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ సంగమేష్ అన్నారు. సోమవారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో కౌతాళం మండల అధ్యక్షుడు హనుమంతరెడ్డి అధ్యక్షతన ఏపీటీఎఫ్ నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నిర్వహణ విషయంలో ఇటీవల గణేకల్లు, హానవాలు, అర్‌జీ నగర్‌లో రాజకీయ పార్టీల కార్యకర్తలు ఘర్షణకు పాల్పడ్డారన్నారు. త్వరలో జరగనున్న ఎస్‌ఎంసీ ఎలక్షన్లలో రాజకీయ జోక్యాన్ని తగ్గించాలన్నారు. నాగరాజు, మల్లికార్జున, రఘురామయ్య, సుదర్శన్ రెడ్డి, గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

ఆదోని టౌన్: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

మోడల్ స్కూల్‌లో విద్యార్థిని మృతి

- మృతిపై అనుమానాలు
- పాఠశాల వద్ద గ్రామస్తుల ఆందోళన


పార్వతి (ఫైల్)

మంత్రాలయం : తల్లిదండ్రులు సుగ్గి బాటన వెళ్లారు. వారి కష్టం ఎంత ఉన్నా నేను చదువుకుంటాను అంటే ఉన్న ఒక్కగానొక్క బిడ్డను హాస్టల్ చేర్పించారు. అయితే చదువుకుంటున్న పాఠశాలలోనే ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామానికి చెందిన కురువ గుండప్ప, కురువ లక్ష్మమ్మ దంపతుల ఏకైక కూతురు పార్వతి (16). ఊరికి దగ్గరలోనే ఉన్న రచ్చుమర్రి ఏపీ మోడల్ స్కూలులో 10వ తరగతి చదువుతోంది. దినచర్యలో భాగంగా ఆదివారం రాత్రి భోజనాలు ముగియగానే విద్యార్థినులు స్టడీకి కూర్చున్నారు. 10 గంటల తర్వాత తమ గదులకు వెళ్లారు. అయితే కాసేపు చదువుకొని వస్తానని పార్వతి పక్కగదిలోకి (20వ నంబర్) వెళ్లింది. వార్డెన్ సుజాత కూడా పడుకోమని చెప్పి వెళ్లిపోయింది. తెల్లవారు జామున స్టడీ హవర్‌లో పార్వతి కనిపించకపోవడంతో వార్డెన్, విద్యార్థినులు పైకి వెళ్లి చూడగా.. ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని చనిపోయి కనిపించింది. వెంటనే వార్డెన్ విషయాన్ని ప్రిన్సిపాల్ ప్రసాద్‌కు, మాధవరం ఎస్‌ఐ కృష్ణమూర్తికి విషయం చెప్పగా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఫ్యాన్ నుంచి దించేశారు.

గ్రామస్తుల ఆందోళన

పార్వతి మృతి విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు పాఠశాలకు చేరుకున్నారు. అప్పటికే విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తీసుకెళ్తుండగా అడ్డగించారు. విద్యార్థిని తల్లిదండ్రులు రాకుండానే ఎలా తీసుకెళ్తారని నిలదీయడంతో తిరిగి పాఠశాలకు చేర్చారు. విద్యార్థిని మరణానికి కారకులను శిక్షించాలంటూ ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఆర్‌పీవీఎఫ్ యూనియన్లతో కలిసి రోడ్డుపై బైఠాయించారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

అధికారుల విచారణ

పార్వతి మరణ వార్త తెలుసుకున్న ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, డీఈఓ శ్యామూల్, డిప్యూటీ ఈఓ వెంకట రమణారెడ్డి, ఎంఈఓలు మొయినుద్దీన్, రాఘన్న, సీఐ రామాంజులు పాఠశాలకు చేరుకుని విచారణ జరిపారు.

పరామర్శ

విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి పాఠశాలకు వెళ్లారు. అక్కడ పార్వతి బంధువులను పరామర్శించారు. విద్యార్థి అంత్యక్రియలకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ భీమారెడి ఉన్నారు.

మా పాపకు ఎలాంటి ఒత్తిడి లేదు

బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లిన తల్లిదండ్రులు గుండప్ప, లక్ష్మమ్మ సాయంత్రం ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఒక్కగానొక్క కూతురు మరణించడంతో బోరున విలపించారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ.. మా పాపకు ఇంటి దగ్గర ఎలాంటి ఒత్తిళ్లు లేవు. మా నుంచి ఎలాంటి దండింపు లేదు. ఇలా ఎందుకు చేసుకుందో అర్థం కావడం లేదు. మా బిడ్డ చావుకు కారణం ఏంటో పోలీసులు తేల్చి న్యాయం చేయాలి అంటూ కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం మృతదేహాన్ని ఆదోని ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సీఐ రామాంజులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: మండలంలోని హానవాల్ బ్రిడ్జివద్ద సోమవారం అక్రమంగా తరలుతున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ విన్నీలత తెలిపారు. ఓ వ్యక్తి రూ.50 వేలు విలువ చేసే 12 బాక్సుల్లో (1152 టెట్రా ప్యాకెట్లు) ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా దాడులు చేశామన్నారు. మోటార్ సైకిల్, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి భోజన ఏర్పాట్లు

ఎమ్మిగనూరుటౌన్: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఉరుకుంద పుణ్యక్షేత్రానికి స్థానిక డిపోతో పాటు ఇతర డిపోల బస్సులను కూడా నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో డ్రైవర్లు, కండెక్టర్లకు మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు డిపో మేనేజర్ అమర్నాథ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం బస్సుడ్రైవర్లు, కండెక్టర్లకు భోజన ప్యాకెట్లను అందజేశారు.

పంటలను కాపాడుకుందాం

పెద్దకడబూరు : వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు మరింత దెబ్బతినకుండా రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి కాపాడుకోవాలని బనవాసి కృషి విజ్ఞాన్ కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డీనేటర్ డాక్టర్ రాఘవేంద్ర, ఉద్యాన శాస్త్రవేత్త మౌనిక, విస్తరణ శాస్త్రవేత్త చందన సూచించారు. మండల కేంద్రంలో ఏఓ ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో మిరుప, పత్తి, వరి పొలాలను సోమవారం సందర్శించారు.

శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం

కౌతాళం: జిల్లాలోప్రసిద్ధి చెందిన దేవాలయాల్లో ఒకటైన ఉరుకుంద ఈరన్నస్వామి శ్రావణ మాస ఉత్సవాలు సోమవారం ఆలయ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభం అయ్యాయి. తెల్లవారు జామున 4గంటలకు సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపారాధన, గోవు పూజ అనంతరం ఆలయ గోపురంపై స్వామి జెండాను ఆవిష్కరించారు. ఉత్సవాలకు మొదటి సోమవారం రోజు కలిసి రావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఉపప్రధాన అర్చకుడు మహదేవస్వామి, ముఖ్య అర్చకులు పాల్గొన్నారు.


ధ్వజారోహణ పూజల్లో పాల్గొన్న డీసీ, సిబ్బంది

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని రణమండలకొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామి వారి శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకుడు టి.జి.పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి సభ్యులు పత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలో ఆంజనేయస్వామి వారి 41 రోజుల దీక్ష చేపట్టారు.

రిక్రియేషన్ క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- సభ్యుల మధ్య వాగ్వాదం
- పోలీస్ స్టేషన్ చేరిన పంచాయతీ


రిక్రియేషన్ క్లబ్ నూతన కార్యవర్గం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎమ్మిగనూరు రిక్రియేషన్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక స్థానిక్ క్లబ్ ఆవరణలో సోమవారం జరిగింది. క్లబ్‌లో వున్న 144 మంది సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వై.పురుషోతం గౌడ్, కార్యదర్శిగా సోగనూరు భీమిరెడ్డి, సహాయకార్యదర్శిగా వజ్రగిరి ఈరన్న, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా వెంకటరంగారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బీఎస్ నాగరాజు, రియాజ్ అహమ్మద్‌లను ఎన్నుకున్నారు. అనంతరం పూర్వపు అధ్యక్షుడు వై.దేవేంద్రగౌడ్ మృతికి సంతాపం తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో క్లబ్‌లో నూతన సభ్యుల చేరిక, కొన్నేళ్ల నుంచి ఎన్నికలు జరపకపోవడం తదితర అంశాలపై పలువురు సభ్యులు ప్రశ్నించగా మిగిలిన సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని స్టేషన్‌కు పిలిపించి చర్చించారు. రూరల్ సీఐ విక్రమసింహా సభ్యులతో చర్చించి, సమస్య పరిష్కారానికి మధ్యే మార్గాన్ని సూచించడంతో వివాదం సద్దు మణిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రుద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.